క్లుప్తంగా

ప్రవాసాంధ్రులు హనిమిరెడ్డిని కలిసిన మంత్రి జోగి రమేష్



మైలవరం: ప్రవాసాంధ్రులు డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డిని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ శుక్రవారం ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఇరువురూ కొద్ది సేపు ముచ్చటించుకున్నారు. డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డిని మంత్రి జోగి రమేష్ శాలువాతో సత్కరించారు. డాక్టర్ హనిమిరెడ్డి నియోజకవర్గంలో నిర్వహిస్తున్న సేవలతో ఎంతో మంది పేదలు, నిరుద్యోగులకు ఆసరా లభిస్తోందని మంత్రి కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు యరమల రాంభూపాల్‌రెడ్డి, జోగి రాము పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం

గంపలగూడెం: ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు గంపలగూడెంలో శుక్రవారం బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో పల్లెకుపోదాం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ ఆధ్వర్యంలో నాయకులు ప్రతి ఇంటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించి కరపత్రాలు, క్యాలెండర్లను పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మలపల్లి మోహనరావు, మాజీ అధ్యక్షుడు ఎ. క్రాంతికుమార్, పిట్టల గోవింద్, కె. నాగగోపాలకృష్ణ పాల్గొన్నారు.

● చాట్రాయి: చాట్రాయిలో శుక్రవారం పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేశారు. బీజేపీ ఏలూరు జిల్లా ఉపాధ్యక్షుడు ఆముదాల ఇస్సాకు, ఓబిళ్లనేని రాజా, మాగంటి వాసు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ విశ్వనాథశాస్త్రి బాధ్యతల స్వీకారం



నూజివీడు: నూజివీడు తహసీల్దార్‌గా విశ్వనాథ శాస్త్రి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా కాకినాడ కలెక్టరేట్‌లో కో-ఆర్డినేషన్ సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న ఆయనను నూజివీడుకు బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ డీవీఎస్ యల్లారావును అమలాపురం డెప్యూటీ కలెక్టర్‌గా ప్రభుత్వం బదిలీ చేసింది.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి



ఇబ్రహీంపట్నం: గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ జె.సునీత అన్నారు. ఇబ్రహీంపట్నంలో మండల స్థాయి ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ గ్రామ సభలో శుక్రవారం ఆమె పాల్గొన్నారు. ఇప్పటికే గ్రామాల్లో పనులు జరుగుతున్నాయని, రానున్న వేసవిలో దీనిని ఎక్కువ మంది వినియోగించుకోవాలన్నారు. గత ఏడాది జనవరి నుంచి ఈ ఏడాది జనవరి వరకు వివిధ గ్రామాల్లో జరిగిన ఉపాధి పనుల ఆడిట్ రికార్డులను పరిశీలించారు. డ్వామా జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి, అప్పారావు, ఇస్మాయిల్, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు వీడ్కోలు



తిరువూరు: స్థానిక శ్రీనిధి జూనియర్ కళాశాలలో సీనియర్ ఇంటర్ విద్యార్థులకు శుక్రవారం వీడ్కోలు కార్యక్రమం జరిగింది. త్వరలో జరగనున్న ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షల్లో మంచి మార్కుల సాధనకు తీసుకోవలసిన జాగ్రత్తలను కళాశాల చైర్మన్ పసుమర్తి వెంకటేశ్వరరావు వివరించారు. కళాశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. విద్యార్థినీ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

విద్యార్థులు ఒత్తిడిని జయించాలి

తిరువూరు: నేటి విద్యా వ్యవస్థలో ర్యాంకులు, మార్కుల కోసం విద్యార్థులపై ఒత్తిడి తీవ్రంగా ఉంటోందని, ఒత్తిడిని తట్టుకోలేక కొందరు చదువులు మానేసే పరిస్థితి వస్తోందని ఆకాశవాణి వ్యాఖ్యాత బి. జయలక్ష్మి అన్నారు. విద్యార్థులు స్థానిక శ్రీవాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఇంజినీరింగ్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ నిర్వహించారు. విద్యార్థులు ఒత్తిడిని జయించి ప్రణాళికాబద్ధంగా చదివితే ఇటువంటి సమస్యలు ఉత్పన్నం కావన్నారు. ముందుగా లక్ష్యాన్ని నిర్దేశించుకుని కోర్సులను ఎంచుకోవాలని సూచించారు. కళాశాల చైర్మన్ పసుమర్తి వెంకటేశ్వరరావు, కరస్పాండెంట్ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు, ఏట కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్‌తో ఆరోగ్య రక్షణ



మైలవరంలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న కళాశాల సిబ్బంది



చాట్రాయిలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న సర్పంచ్ ఉషా

- ఘనంగా జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం
- పాఠశాలల్లో విద్యార్థులకు మాత్రల పంపిణీ
- ఆరోగ్యంపై అవగాహన కల్పించిన వక్తలు

మైలవరం: ఆల్బెండజోల్ మాత్రలు వాడి పిల్లల్లో నులి పురుగులను నివారించాలని, తద్వారా వారి ఆరోగ్యాన్ని కాపాడాలని డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాసు అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను కళాశాల స్టాఫ్ స్వీయ పర్యవేక్షణలో పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మందుల వలన కలిగే లాభాలను వివరించారు. జాతీయ నులి పురుగుల దినోత్సవం ఆవశ్యకతను తెలిపారు. కార్యక్రమాన్ని కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, రెడ్‌క్రాస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంగ్లిష్ హెడ్ ఆఫ్ ద డిపార్ట్‌మెంట్ సుభాషిణీ, ఫిజిక్స్ హెచ్‌ఓడీ ఉమాలక్ష్మి, ఐక్యూఏసీ కన్వీనర్ డాక్టర్ రాముడు, పీడీ మేజర్ మన్నేస్వామి తదితరులు పాల్గొన్నారు.

● ఇబ్రహీంపట్నం: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం మండలంలోని వివిధ పాఠశాలల్లో శుక్రవారం జరిగింది. కాచవరం ఎంపీపీ పాఠశాలలో పీహెచ్‌సీ వైద్యురాలు పర్వీన్ వ్యక్తిగత పరిశుభ్రత, కలుషిత ఆహారం తీసుకోవడం వల్ల కలిగే ఇబ్బందులను విద్యార్థులకు వివరించారు. ఆహారం తీసుకునే ముందు, టాయిలెట్‌కు వెళ్లిన తరువాత చేతులను శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఏడాది నుంచి 19 ఏళ్ల వయస్సు గల వారికి ఆల్బెండజోల్ 400 ఎంజీ మాత్రలు వేశారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ నూర్జహాన్, హెచ్‌ఎం నాగమల్లేశ్వరి, ఉపాధ్యాయులు అనూరాధ, ఇర్ఫాన్‌పాషా, సీఆర్పీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.



గంపలగూడెంలో మాత్రలు వేస్తున్న వైద్యురాలు శృతి

● నూజివీడు: పట్టణంతో పాటు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు శుక్రవారం నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. 19 ఏళ్ల లోపు వయస్సు ఉన్న వారు ఏడాదికి రెండుసార్లు నులి పురుగుల నివారణ మాత్రలను ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖ ద్వారా పంపిణీ చేస్తోంది. గొల్లపల్లి హైస్కూల్లో విద్యార్థులకు పాఠశాల హెచ్‌ఎం పొట్లూరి రాధికారాణి ఆధ్వర్యంలో మాత్రలను పంపిణీ చేశారు. హెల్త్ సూపర్‌వైజర్ పద్మావతి, ఏఎన్‌ఎం ప్రిస్కిల్లా, ఆశా వర్కర్లు కాసులు, దేవకరుణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● చాట్రాయి: మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం నులి పురుగల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. మండలంలో 6,825 మంది విద్యార్థులు, చిన్నారులు ఉండగా 6,702 మందికి నులి పురుగుల నివారణ మందులు వేసినట్లు పీహెచ్‌సీ వైద్యుడు శ్రీనివాసరెడ్డి తెలిపారు. చాట్రాయి జెడ్పీ హైస్కూల్లో సర్పంచ్ దామెర ఉషా, బూరుగుగూడెంలో సర్పంచ్ దేశిరెడ్డి హైమావతి, పోలవరంలో పీఏసీఎస్ చైర్మన్ చెలికాని బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

● గంపలగూడెం: గంపలగూడెం, ఊటుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు



రెడ్డిగూడెంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న సిబ్బంది

పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కళాశాలల్లో 19 సంవత్సరాల లోపు వయస్సు గల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. వైద్యులు శృతి, సురేష్‌లు మాట్లాడుతూ నులి పురుగుల కారణంగా పిల్లలో సంక్రమించే అనారోగ్య పరిస్థితులను వివరించారు. ఊటుకూరు పీహెచ్‌సీ పరిధిలో 4,658 మందికిగాను 4,206 మందికి, గంపలగూడెం పీహెచ్‌సీ పరిధిలో 7,769 మందికి గాను 7,416 మందికి నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ చేశామని వైద్యులు వివరించారు.

● రెడ్డిగూడెం: మండలంలోని అన్ని అంగన్‌వాడీ, ఎలిమెంటరీ, యూపీ హైస్కూల్, కాలేజీలలో 19 సంవత్సరాల లోపు విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. 7,321 మందికి గాను 6,959 మందికి మాత్రలు పంపిణీ చేశామని వైద్యులు సందేష్ తెలిపారు.

● ముసునూరు: పీహెచ్‌సీల బృందం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించి, పాఠశాలల్లో బాలబాలికలకు నులి పురుగుల నివారణ మందులు వేశారు. 8,987 మంది బాలలు లక్ష్యం కాగా 8,503 మందికి నులి పురుగు నివారణ మాత్రలు పంపిణీ చేశారు. పీహెచ్‌సీల వైద్యులు షకీనా ఇవాంజిలిన్, కరీముల్లా, ఎంపీహెచ్‌ఈఓలు పాల్గొన్నారు.

నగర పంచాయతీ వార్షిక బడ్జెట్‌కు ఆమోదం

తిరువూరు: తిరువూరు నగర పంచాయతీ 2024–25 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన బడ్జెట్ అంచనాలను శుక్రవారం జరిగిన కౌన్సిల్ సమావేశం ఆమోదించింది. చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి అధ్యక్షతన జరిగిన సమావేశంలో చర్చించిన కౌన్సిలర్లు రూ.6.13 కోట్ల అంచనాతో బడ్జెట్‌కు ఆమోదం తెలిపారు. ప్రభుత్వం నుంచి వచ్చే తలసరి గ్రాంట్లు, ఎంపీ గ్రాంటు, ఆర్థిక సంఘ నిధులు, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ నిధులు, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో పాటు ఇతర గ్రాంట్లతో చేపట్టవలసిన పనులపై చర్చించారు. నగర పంచాయతీ దుకాణ సముదాయాల అద్దెలు, ఇతర వేలంపాటల ద్వారా వచ్చే ఆదాయంతో చేపట్టిన కార్యక్రమాలను అధికారులు వివరించారు. పట్టణంలోని 20 వార్డులలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని తీర్మానించారు. పీటీ కొత్తూరులో శ్మశాన వాటికకు స్థల కేటాయింపునకు



బడ్జెట్‌పై చర్చిస్తున్న కౌన్సిలర్లు

రెవెన్యూ అధికారులను కోరుతూ ప్రతిపాదనలు పంపాలని తీర్మానించారు. కమిషనర్ లోవరాజు, వైస్ చైర్‌పర్సన్లు వెలుగోటి విజయలక్ష్మి, వెంకటేశ్వరి, కౌన్సిలర్లు పరసా శ్రీనివాసరావు, పసుపులేటి శేఖర్ బాబు, నదియా, పరసా సత్యనారాయణ, హుస్సేన్, నాళ్ళా సురేంద్ర, మోదుగు ప్రసాద్, మూడు దుర్గారావు, దారా పద్మనీలిమ, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు



గానుగపాడు(తిరువూరురూరల్): ఏదైనా ఆహారం తీసుకున్న వెంటనే నోటిని శుభ్రం చేసుకోవాలని, రోజుకు రెండుసార్లు దంతధావనం చేసుకోవాలని ప్రముఖ దంత వైద్యులు యంగ్రాతి నవీన్ సూచించారు. గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. సిగరెట్, పొగాకు, మద్యం తదితర దురలవాట్లు ఉన్న వారి దంతాలు త్వరగా దెబ్బతింటాయన్నారు. విద్యార్థులు దంత సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఆదిలక్ష్మి, జన విజ్ఞాన వేదిక సభ్యులు రాంప్రదీప్, సుదర్శన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ పంపిణీ



స్కాలర్‌షిప్‌లు అందుకున్న విద్యార్థులతో ఫౌండేషన్ సభ్యులు, కళాశాల సిబ్బంది

మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల(ఎల్బీఆర్‌సీఈ)లో నార్త్ సౌత్ ఫౌండేషన్ రెన్యూవల్ స్కాలర్‌షిప్స్‌ను శుక్రవారం విద్యార్థులకు అందజేశామని కళాశాల ప్రిన్సిపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో మొత్తం 84 మంది విద్యార్థులకు రూ. 21 లక్షల చెక్‌లను అందజేశామన్నారు. గత ఏడాది 87 మందికి రూ.21.75 లక్షలు, ప్రస్తుతం 84 మందికి మొత్తంగా 42.75 లక్షలు పంపిణీ చేశామని తెలిపారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, ఎల్బీఆర్‌సీఈ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మైలవరం సబ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగిందన్నారు. ఇండియన్ నార్త్ సౌత్ ఫౌండేషన్ స్కాలర్‌షిప్స్ లీడ్ సాయి రాచకొండ, ఎల్‌బీఆర్‌సీఈ ట్రస్టీ డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి, ఫౌండేషన్ ఇండియా మేనేజింగ్ ట్రస్టీ చార్టెడ్ అకౌంటెంట్ జేఎస్ఆర్ ప్రసాద్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదలకు మేలు

ఆగిరిపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదలకు ఎంతో మేలు జరిగిందని ఎంపీపీ గొల్ల అనూష అన్నారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ గొల్ల అనూష అధ్యక్షతన శుక్రవారం జరిగింది. మండలంలోని అంతర్గత రహదారులను సీసీ రోడ్లుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. పలు అంశాలపై సమావేశంలో చర్చించారు. సీతారాంపురం సర్పంచ్ అత్తి మురళి, ఎంపీటీసీ సాదం గోపి, జెడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు, ఎంపీడీఓ శామ్యూల్, వైస్ ఎంపీపీ కొండ వరదల రమేష్, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

మంత్రి జోగి రమేష్‌ను కలిసిన ఏపీఎంలు



మంత్రి జోగి రమేష్, సర్నాల తిరుపతిరావు యాదవ్‌తో ఏపీఎంలు

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్‌ను వివిధ మండలాల వైఎస్సార్ క్రాంతి పథం ఉద్యోగులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ సర్నాల తిరుపతిరావు యాదవ్‌ను ఉద్యోగులకు మంత్రి పరిచయం చేశారు. శాలువాతో సత్కరించి అభినందించారు. వైఎస్సార్ క్రాంతి పథం ఉద్యోగుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఏరియా కో-ఆర్డినేటర్ నాయక్, వివిధ మండలాల ఏపీఎంలు శామ్యూల్, గురవయ్య, శ్రీనివాస్ చంద్రశేఖర్, శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణదారుల సంఘం ఏర్పాటు

తిరువూరు: తిరువూరు మండలంలో భవన నిర్మాణదారుల సంఘాన్ని గురువారం ఏర్పాటు చేశారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అసోసియేషన్‌కు అనుబంధంగా ఏర్పాటైన ఈ సంఘానికి అధ్యక్ష కార్యదర్శులుగా భవనం విజయ భాస్కర రెడ్డి, గుడిమెట్ల చిన్న వెంకటేశ్వరరావు, కోశాధికారిగా అనుమోలు అనిల్‌కుమార్‌లను ఎన్నుకున్నారు.

పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవం

మైలవరం: పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవం మైలవరంలోని యూనియన్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. జిల్లా నాయకులు కోసూరి రాజశేఖర్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ చేసిన పోరాటాలను వివరించారు. పీఆర్టీయూ మైలవరం మండల శాఖ అధ్యక్షుడు పల్లపోతుల గోపాల్, మండల ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేష్, సూరిబాబు, సతీష్, రాష్ట్ర కార్యదర్శి పుల్లారెడ్డి, రంగబాబు, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

రథసప్తమి ఉత్సవ ఏర్పాట్లపై సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావు

ఆగిరిపల్లి: శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నృసింహ స్వామి రథసప్తమి ఉత్సవాల ఏర్పాట్లపై ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు స్థానిక పొన్నం కల్యాణ మండపంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో శోభనాచల స్వామి ఆలయానికి ఘాట్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి పూర్తి చేస్తామని తెలిపారు. జెడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు, తహసీల్దార్ మృత్యుంజయ రావు, విద్యుత్ శాఖ ఏఈ రామారావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పల్లగాని నరసింహారావు, జిల్లా కార్యదర్శి మచ్చా హరి బాబు, ఎస్ఐ సురేంద్ర కుమార్, డెప్యూటీ తహసీల్దార్ పవన్ కుమార్ పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు ఎస్వీ సారథిరావు

మైలవరం: చిరస్మరణీయుడు ఎస్వీ సారథిరావు అని సీపీఎం కృష్ణా జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పీవీ ఆంజనేయులు అన్నారు. మైలవరంలో ఎస్వీ సారథిరావు వర్ధంతి కార్యక్రమం స్థానిక నూజివీడు రోడ్డులోని గాంధీ గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించారు. సారథిరావు విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. ఆంజనేయులు మాట్లాడుతూ సారథిరావు సేవలను కొనియాడారు. ఎస్వీ మోహనరావు, సీనియర్ నాయకులు మద్దిరెడ్డి మాధవరెడ్డి, షేక్ అల్లాబక్షు, మండల కార్యదర్శి రావూరి రమేష్‌బాబు, నాయకులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల వద్ద సౌకర్యాల పరిశీలన

ముసునూరు: ఓటర్లు తమ ఓటు హక్కు సక్రమంగా వినియోగించుకునేలా పోలింగ్ బూత్‌లను బీఎల్వోలు సిద్ధం చేయాలని డీటీ ఎమిలీ కుమారి ఆదేశించారు. మండలంలోని గోపవరం, కాట్రేనిపాడు హైస్కూల్స్, ప్రాథమిక పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం డీటీ పరిశీలించి పలు సూచనలు చేశారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

గంపలగూడెం: తోటమూల వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం 24వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దివ్య కల్యాణం జరిగింది. పలువురు దంపతులు పీటలపై కూర్చొని కన్యాదానం చేశారు. కల్యాణం విశిష్టతను అర్చకులు వివరించారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నదానంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

మహిళాభ్యున్నతికి ప్రభుత్వం పెద్ద పీట

నల్లగట్ల స్వామిదాసు



నమూనా చెక్కు అందజేస్తున్న స్వామిదాసు

తిరువూరు: మహిళల అభ్యున్నతికి జగనన్న ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో శుక్రవారం మండలంలోని 869 డ్వాక్రా గ్రూపుల సభ్యులకు వైఎస్సార్ ఆసరా పథకం కింద మంజూరైన చెక్కులను శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. స్వామిదాసు మాట్లాడుతూ సామాజిక, కుటుంబ ప్రగతిలో మహిళలే కీలక పాత్ర పోషిస్తున్నారని, వారికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే గుర్తింపు లభించిందన్నారు. 2019 ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా మహిళలకు ఆసరా పథకాన్ని అమలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ అండగా నిలవాలని పిలుపు నిచ్చారు. తిరువూరు మండలంలోని డ్వాక్రా మహిళలకు రూ.6.83 కోట్ల మేర చెక్కులను పంపిణీ చేశారు. మహిళల సంక్షేమానికి జగనన్న ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. మహిళలకు అన్ని విధాలుగా మేలు చేస్తున్న జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, ఎంపీపీ గద్దల భారతి, ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, పలు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యం



గంపలగూడెం మండలం కొణిజెర్లలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కొణిజెర్ల(గంపలగూడెం): గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహిస్తోందని వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ ఎంపీటీసీ బొల్లా కరుణాకరరావు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్-2లో భాగంగా గంపలగూడెం మండలం ఊటుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కొణిజెర్లలో శుక్రవారం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిపుణులైన వైద్యులచే నిర్వహిస్తున్న ప్రత్యేక వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పలువురు వైద్యులు మాట్లాడుతూ వివిధ రకాల వ్యాధులు, వాటి లక్షణాలను వివరించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. శిబిరంలో 473 మంది రోగులను వైద్యులు పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. సర్పంచ్ ఇనపనూరి నాగమణి, బొల్లా కరుణాకరరావు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును కాపాడుకోవాలి

మైలవరం: ప్రజలు పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు సంస్థను కేంద్రలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు యత్నిస్తోందని, విశాఖ ఉక్కు కంపెనీని కాపాడుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పీవీ ఆంజనేయులు పిలుపునిచ్చారు. మైలవరం గాంధీ గ్రంథాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 16న జరిగే గ్రామీణ బంద్‌ను, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఆంజనేయులు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోందని విమర్శించారు. కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు కార్మిక కోడ్‌లు తీసుకువచ్చిందని, ప్రత్యేక హోదాను నిరాకరించిందని, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని అమ్మకానికి పెట్టిందని, కృష్ణా జలాల పంపిణీలో రాష్ట్రానికి ద్రోహం చేస్తోందని విమర్శించారు. సీఐటీయూ మైలవరం మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు యలమందారావు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మద్దిరెడ్డి మాధవరెడ్డి, కార్మిక, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

మామిడి పంటకు ఇన్సూరెన్స్ స్కీమ్ వర్తింపజేయాలి

వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ దామోదరరెడ్డి



మాట్లాడుతున్న దామోదరరెడ్డి

విస్సన్నపేట: మామిడి పంటకు ఇన్సూరెన్స్ స్కీమ్ వర్తింపజేయాలని వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ దోర్నాల దామోదరరెడ్డి అన్నారు. స్థానిక రైతు భరోసా కేంద్రం వద్ద మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. పలు అంశాలపై చర్చించారు. ఈ క్రాప్, ఈకేవైసీ గడువు ఈ నెల 15 తేదీ వరకు ఉందని, సంబంధిత రైతు భరోసా కేంద్రాల వద్ద రైతులు నమోదు చేయించుకోవాలని ఏఓ రాజ్యలక్ష్మి అన్నారు. కార్యక్రమంలో హెచ్ఓ నరేంద్రకుమార్, వెటర్నరీ వైద్యుడు అవినాష్, మండలి సభ్యులు కాసర చెన్నారెడ్డి, కోటా శ్రీనివాసరావు, కె. వెంకటరత్నం, రైతు భరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

పుల్లారెడ్డికి సర్నాల పరామర్శ



మైలవరం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వైఎస్సార్ సీపీ కార్యకర్త సీహెచ్ పుల్లారెడ్డిని మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావు శుక్రవారం పరామర్శించారు. తిరుపతిరావు మాట్లాడుతూ కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఏ అవసరం వచ్చిన తాను అందుబాటులో ఉంటానని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గర్నేపూడి వెంకట్రావు, పట్టణ అధ్యక్షుడు పాల నారాయణ రెడ్డి, ఎస్.డీపీ, చామల సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణపై అవగాహన

నూజివీడు: రోడ్డు ప్రమాదాల నియంత్రణపై అవగాహన కార్యక్రమం నూజివీడు ట్రిపుల్ ఐటీలో శుక్రవారం జరిగింది. గన్నవరంలోని సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా స్పందించాలి, బాధితుల ప్రాణాలను కాపాడేందుకు తీసుకోవాల్సిన చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలు, రిలేటెడ్ ట్రామా, ఓరల్, మాక్సిల్లో ఫేషియల్ సర్జన్ల పాత్రను వివరించారు. డీన్ విద్యార్థి సంక్షేమ అధికారులను ఆర్జీయూకేటీ నూజివీడు క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం. చంద్రశేఖర్ అభినందించారు. కార్యక్రమంలో డీన్ విద్యార్థి సంక్షేమ అధికారులు డాక్టర్ ఎస్వీ వెంకట్రావు, వి.స్రవంతి పాల్గొన్నారు.